సాక్షి
ప్రకాశం

బుధవారం ၊ 6 ၊ నవంబర్ ၊ 2024



రుణాల మంజూరులో ఉదారత చూపాలి

రుణాల మంజూరులో బ్యాంకర్లు ఉదారత చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా బ్యాంకర్లకు సూచించారు. - 8లో..



వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తెస్తాం

నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తెస్తామని కారుమూరి నాగేశ్వరరావు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 35/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఎస్‌జీఎఫ్ టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక



టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన ఎస్‌జీఎఫ్ జిల్లా క్రీడాకారులు

ఒంగోలు: ఎస్‌జీఎఫ్ టెన్నికాయిట్ క్రీడా జట్ల ఎంపిక మంగళవారం స్థానిక త్రోవగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను పాఠశాల హెడ్మాస్టర్ సీహెచ్ రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఉపయోగపడతాయని పేర్కొంటూ విద్యార్థుల భవిష్యత్‌కు ఆటలు ఎలా ఉపయోపగడతాయో వివరించారు. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఎంపికైన జట్లు ఈ నెల 9 నుంచి 11 తేదీల మధ్య ఏలూరు జిల్లా చింతలపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని తెలిపారు.

రేపు బాస్కెట్‌బాల్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక ఈ నెల 7న నిర్వహించనున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలేటి రవీంద్ర, తొట్టెంపూడి సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు కందుకూరు డీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 98661426955, 9963647799 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జిల్లాకు జ్వరమొచ్చింది..

జిల్లాకు జబ్బు చేసింది. ప్రజలపై విషజ్వరాలు ముప్పేట దాడి చేస్తున్నాయి. పల్లె, పట్నంలోని చిన్నా చితకా ఆస్పత్రులు సైతం రోగులతో కిక్కిరిసిపోయాయి.. రోజుల తరబడి జలుబు, దగ్గు పట్టి పీడిస్తుండడంతో ప్రజలు చిరాకు పడుతున్నారు. చికున్ గున్యా తరహాలో కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. అడుగు తీసి అడుగేయలేని పరిస్థితిలో వైద్యం కోసం ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఏ గ్రామాన్ని పరిశీలించినా ఇంటికొకరు, ఇద్దరు చొప్పున జ్వరంతో బాధపడడం కనిపిస్తోంది. డెంగీ కేసులు అమాంతంగా పెరిగిపోయాయి. ప్రజలు విష జ్వరాలతో నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం మద్యం వ్యాపారంలో తలమునకలైంది. ప్రజల ఆరోగ్యం గురించి ఏమాత్రం పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలైనా ఆరోగ్య శాఖకు సంబంధించి ఎలాంటి సమీక్ష నిర్వహించలేదు. ఎలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు.



ఒంగోలు రిమ్స్ జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

- జిల్లాలో ఇంటింటా జ్వరాలు
- పల్లె, పట్నంలో ప్రబలుతున్న విషజ్వరాలు
- కిటకిటలాడుతున్న వైద్యశాలలు
- జలుబు, దగ్గుతో చిరాకు పడుతున్న ప్రజలు
- వైద్య శిబిరాల ఊసేలేదు
- మద్యం వ్యాపారంలో ప్రభుత్వం తలమునకలు
- ప్రజల ఆరోగ్యం పట్టించుకునే తీరిక లేని పాలకులు
- టీడీపీ, జనసేన మంత్రుల ఆధిపత్యంలో ఆగిపోయిన డీఎంహెచ్‌ఓ పోస్టింగ్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జలుబు, దగ్గు, కీళ్లనొప్పులతో జ్వరాలు వస్తున్నాయి. ఒక ఇంట్లో ఒకరికి వస్తే ఆ తరువాత ఆ ఇంట్లో ఉన్న వారందరికీ అదే లక్షణాలతో జ్వరాలు వస్తున్నాయి. ఇంటిల్లిపాదీ జ్వరంతో మంచం పడుతున్నారు. కొందరికి మాత్రం రెండు మూడు రోజులకు జ్వరం తగ్గినట్లు కనిపిస్తున్నా జలుబు, దగ్గు మాత్రం వీడడం లేదు. గొంతు బొంగురు పోయేలా దగ్గు భయపెడుతోంది. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కొండపి, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు జ్వర బాధితులతో నిండిపోతున్నాయి. ప్రజలు అవస్థలు పడుతున్నా జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఊసేలేని ఉచిత వైద్య శిబిరాలు..

సాధారణంగా జూన్, జులైలో సీజనల్ వ్యాధులు ప్రారంభమవుతాయి. అక్టోబర్ నాటికి సద్దుమణుగుతాయి. ఈసారి దీనికి భిన్నమైన వాతావరణం నెలకొంది. దీంతో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. నవంబర్ వచ్చినా ఆ పరిస్థితిలో తగ్గుదల కనిపించడం లేదు. ఇంకా జ్వరాలు, జలుబు, దగ్గు పట్టిపీడిస్తున్నాయి. డెంగీ జ్వరాలు వస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. ఇప్పుడు జిల్లా మొత్తం మంచం పట్టిన సమయంలో ఉచిత వైద్య శిబిరాల ఊసే లేదు. నాలుగు నెలలుగా ప్రజల వద్ద పైసల్లేకుండా పోయాయి. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో వైద్యం చేయించుకునేందుకు తటపటాయించే పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికంగా ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. వారిచేత ఒక ఇంజక్షన్ వేయించుకొని మందులు వాడుకుంటున్నారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

పెండింగులో డీఎంహెచ్‌ఓ పోస్టింగ్

జిల్లాలో 8 నెలలుగా రెగ్యులర్ డీఎంహెచ్‌ఓ లేరు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి రిటైర్డ్ కావడంతో పోస్టు ఖాళీ అయింది. అప్పటి నుంచి ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓతో నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే గతంలో ఇక్కడ డీఎంహెచ్‌ఓగా పనిచేసి వెళ్లిన డాక్టర్ రత్నావళిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉత్తర్వులు ఇచ్చిన కొద్దిసేపటికే రద్దు చేసి పడేసి ఆ ఉత్తర్వులను చెత్తబుట్టలో వేశారు. ఆమె పోస్టింగును పెండింగ్‌లో పెట్టారు. టీడీపీ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభ్యంతరం పెట్టడం వల్లనే ఆమె పోస్టింగును ఆపినట్లు ప్రచారం జరుగుతోంది. రత్నావళికి కృష్ణా జిల్లా మాజీ వైఎస్సార్‌సీపీ నాయకుడు సాదినేని ఉదయభానుతో పరిచయముంది. ఆయన ద్వారా జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన రత్నావళి ఒంగోలు డీఎంహెచ్‌ఓగా పోస్టింగు తెచ్చుకున్నట్లు సమాచారం. అయితే ఈ పోస్టుకు అద్దంకికి చెందిన డాక్టర్ వెంకటేశ్వరరావుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన వెంకటేశ్వరరావుకు డీఎంహెచ్‌ఓగా ఇవ్వాలని ఖరాఖండిగా చెబుతున్నారు. మంత్రి నాదెండ్ల మాత్రం రత్నావళికి ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు మంత్రుల పుణ్యమాని జిల్లాకు డీఎంహెచ్‌ఓ లేకుండా పోయారని విమర్శలు వినవస్తున్నాయి. అంతేకాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు సమ్మె బాట పట్టారు. తొలుత అత్యవసర వైద్య సేవలను బహిష్కరించినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఆ తరువాత అన్ని రకాల వైద్య సేవలను బహిష్కరించారు. అయినా ప్రభుత్వం సకాలంలో వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకురాలేదు. రోజుల తరబడి సమ్మె చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. అయినా సరే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది.

250 డెంగీ కేసులు పాజిటివ్...

జిల్లాలో డెంగీ కేసులు అమాంతం పెరిగిపోతున్నాయి. ఏ నెలకానెల కేసులు పెరిగిపోతున్నాయే కానీ తగ్గడం లేదు. గత ఏడాది జిల్లాలో కేవలం 200 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 250 కేసులు పాజిటివ్‌గా నిర్ధారించారు. ఇంకా ఈ ఏడాది ముగియడానికి మరో రెండు నెలల సమయం ఉంది. నవంబర్, డిసెంబర్‌లో మరో 50 కేసుల వరకు డెంగీ పాజిటివ్ వచ్చే అవకాశాలున్నాయి. సెప్టెంబర్‌లో 35 కేసులు, అక్టోబర్‌లో 22 కేసులు పాజిటివ్ వచ్చాయి. ఈ లెక్కలన్నీ ప్రభుత్వ వైద్యశాలలో నమోదైన డెంగీ కేసులు మాత్రమే. ప్రైవేటు వైద్యశాలలకు వస్తున్న డెంగీ కేసుల గురించి స్పష్టమైన లెక్కలు లేవు. ప్రభుత్వ వైద్యశాలల్లో నమోదైన వాటి కంటే రెట్టింపు కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు ఒక అధికారి చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది డెంగీ కేసులు బాగా పెరిగిపోయాయి. ఒకవైపు డెంగీ ఇంతలా భయపెడుతున్నా సమన్వయంతో పనిచేయాల్సిన వైద్య శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నామమాత్రపు సమావేశాలతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఒంగోలు రిమ్స్‌లో ఓపీ వద్ద రద్దీ

రాష్ట్రం రావణకాష్టంలా మారింది

- జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు
- ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు, పక్కన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి ఒంగోలు: రాష్ట్రం రావణకాష్టంలా మారిందని, ఇందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలే నిదర్శనమని ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న శాంతి భద్రతల సమస్యపై నిన్ననే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారన్నారు. ''కూటమిలో ఉపముఖ్యమంత్రిగా ఉండి బయట తిరుగుతుంటే మమ్మల్ని ప్రజలు తిడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడండి. ఈ రాష్ట్రం చాలా దారుణంగా ఉందని, అరాచకంగా ఉందని, మర్డర్లు, మానభంగాలు జరుగుతున్నాయని''పవన్ ఒప్పుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఎమ్మెల్యే ప్రజల దగ్గరకు వెళ్లలేని పరిస్థితి కూటమి ప్రభుత్వంలో ఉందని విమర్శించారు. ఏ ఒక్క ఇంటికైనా వెళ్లి మేము ఇది చేశాం అని చెప్పుకునే దమ్ము, ధైర్యం అధికారపార్టీ ఎమ్మెల్యేలకు లేదన్నారు. వాళ్ల కార్యకర్తలు కూడా సిగ్గుపడుతున్నారని, పవన్‌కళ్యాణ్ సైతం నిన్న ఇవే మాటలు అన్నారని కారుమూరి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో గడప గడపకు వెళ్లి పథకాల గురించి వివరించామని, ప్రజలు అపూర్వ స్వాగతం పలికారంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ధైర్యం అని అన్నారు. మేము ఓడిపోయే పరిస్థితి లేదు.. ఏదో జరిగిందని మా నాయకుడే చెప్పారని, సాక్ష్యాలు లేవు కాబట్టి చెప్పలేక పోతున్నాను, మాకు జరగాల్సింది కాదన్నారు. మిషన్ల మీద పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. లా అండ్ ఆర్డర్ ఇలా అవడంపై పవన్ హోంమినిస్టర్‌ను తప్పు పట్టడం చూస్తుంటే పలు అనుమానాలు వస్తున్నాయన్నారు. అసలు లా అండ్ ఆర్డర్ చంద్రబాబు వద్ద ఉంటుందని, దీనికి బాధ్యత చంద్రబాబే వహించాలన్నారు. రాష్ట్రంలో 55 మంది రెగ్యులర్ డీఎస్పీలు, 23 ట్రైనీ డీఎస్పీలు, 50 ఏఎస్పీలు, ఏ డివిజన్‌లో చూసినా 20 లేదా 30 ఖాళీలు ఉన్నాయన్నారు. వీరిని ఎందుకు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం లేదన్నారు. ఇన్ని రకాల అరాచకాలు జరుగుతుంటే మీరు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఖాళీలు పూర్తి చేసి లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లోకి తెచ్చుకోండన్నారు.

ఐదు నెలలుగా అరాచక పాలన:

ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఐదు నెలలుగా రాష్ట్రంలో అరాచకపాలన కనిపిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా వారిని అరెస్టులు చేయడం వంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య విధానాలు కొనసాగని ప్రభుత్వం అని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరుగుతున్నాయనీ, పిల్లల్ని బడికి పంపితే తిరిగి ఇంటికి వచ్చే వరకు భయంతో అభద్రతతో తల్లిదండ్రులు ఉంటున్నారన్నారు. వీధి, వీధికీ బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారని చెప్పారు. కూల్‌డ్రింక్ దొరికినంత సులభంగా మద్యం దొరుకుతుందని ఎద్దేవా చేశారు. అది కూడా దాడులకు కారణమవుతోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బెల్ట్ షాపులు లేని రాష్ట్రంగా ఏపీ తయారైతే, నేడు వీధి వీధిలో బెల్ట్‌షాపు వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానమే ఉద్యమాలు, పోరాటాలతో ప్రారంభమైందని, పోరాటాలు కొత్తేమీకాదన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పోరాడటానికి సిద్ధంగా ఉండాలన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పనిచేసి జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని 8 సీట్లకు 8 సీట్లు కైవసం చేసుకునేలా, కార్యకర్తలందరికీ అందుబాటులో ఉండి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్‌మీడియా కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను స్వేచ్ఛగా చెప్పుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని విమర్శించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు బుర్రా మధుసూదన్ యాదవ్, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, టీజేఆర్ సుధాకర్ బాబు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, అద్దంకి ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కాకుమాను రాజశేఖర్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కనకారావు మాదిగ, బీసీ నాయకుడు బొట్ల రామారావు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పునరావృతం కాకూడదు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీల సమస్యలు పునరావృతం కాకుండా చిత్తశుద్ధితో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు డివిజన్ సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు పర్యవేక్షించాలన్నారు. గ్రీవెన్స్ హాలులో మంగళవారం ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రీవెన్స్ అర్జీలు పరిష్కరిస్తున్న తీరుపై ఆడిట్ జరుగుతుందన్నారు. వచ్చిన ప్రతి అర్జీని నిర్దేశిత సమయంలో సహేతుకంగా పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంపై అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా పనిచేయాలన్నారు.

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్జీల పరిష్కారం కోసం గడువు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వేగంగా పరిష్కరించాలన్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉన్నందున నీటి వనరులు కబ్జాకు గురికాకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, డీఎస్‌ఓ పద్మశ్రీ, ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల కథ కంచికే..!



వాహనం ద్వారా సామగ్రి తరలింపు

- ప్రొఫెసర్ల బదిలీలు
- ఆగిన నిర్మాణ పనులు
- మెడికల్ కాలేజీలో సామగ్రి తరలింపు

మార్కాపురం: సరైన వైద్యసేవలందక చిన్నపాటి రోగానికి పొరుగు జిల్లాలకు వెళ్లి అవస్థలు పడుతున్న పశ్చిమ ప్రకాశం వాసులకు మెరుగైన వైద్యసేవలందించే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సూపర్ స్పెషాలిటీ సేవలు అందించడమే కాకుండా వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. రూ.475 కోట్లతో మార్కాపురం మండలం రాయవరం వద్ద కళాశాల నిర్మించే దిశగా చర్యలు చేపట్టారు. 75 శాతం పనులు ఎన్నికల నాటికి పూర్తయ్యాయి. 150 మెడికల్ సీట్లను భర్తీ చేయాలన్న లక్ష్యానికి అనుకూలంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది నుంచి ఎంబీబీఎస్ సీట్లు భర్తీ అయి క్లాసులు ప్రారంభించాల్సి ఉంది. అలాగే మార్కాపురం జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి 100 నుంచి 500 పడకల స్థాయికి పెంచి 75 మంది వైద్య నిపుణులను నియమించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీన్ మొత్తం రివర్స్ అయింది. నీట్‌లో కూడా మార్కాపురం మెడికల్ కాలేజీని చేర్చలేదు. ఎంబీబీఎస్ సీట్లు రాకుండా అడ్డుకుంది. నిర్మాణ పనులను నిలిపేసింది. 140 రోజుల నుంచి కాలేజీ నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో పాటు కళాశాల ప్రిన్సిపల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను, 30 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇటీవలే కౌన్సెలింగ్ నిర్వహించి ఒంగోలు, గుంటూరు, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం తదితర మెడికల్ కాలేజీలకు బదిలీ చేసింది. మిగిలిన వైద్య నిపుణులను కూడా త్వరలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేయనుంది. దీంతో మెడికల్ కాలేజీ నిర్మాణం లేనట్టేనని భావించిన నిర్మాణ సంస్థ కళాశాలలో ఉన్న ఇనుము, సిమెంట్ ఇతర సామగ్రిని మంగళవారం నుంచి లారీలలో తరలించే ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఈ ప్రాంత ప్రజల కల కలగా మారింది. కూటమి ప్రభుత్వ నిర్ణయం పశ్చిమ ప్రాంత ప్రజలకు శాపమైంది. మెడికల్ కాలేజీ తరలిపోతున్నా కూటమి ఎమ్మెల్యేలు మౌనంగా ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



టైల్స్ బాక్సులు తరలిస్తున్న కూలీలు

నాగాయ.. అనంత రూపాయ



ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో నాగశిలలకు పాలుపోస్తున్న మహిళలు

"నాగాయ అనంత రూపాయ.. శేష రూప నమోస్తుతే.. సర్పరూప నమోస్తుభ్యం నాగేంద్రాయ నమోనమః" అంటూ నాగేంద్రుని మహిళలు భక్తిశ్రద్ధలతో పూజించారు. నాగులచవితి పర్వదినం.. సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రీతిపాత్రమైన మంగళవారం కలిసి రావడంతో మహిళలు పెద్ద ఎత్తున ఆలయాల వద్ద బారులుతీరారు. నాగశిలలకు, పుట్టలలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఒంగోలులోని రంగారాయుడు చెరువు వద్ద ఉన్న పుట్టలో పాలుపోస్తున్న మహిళలు

క్లుప్తంగా

ఎక్సైజ్ సూపరింటెండెంట్ అవినీతిపై విచారణ చేపట్టాలి

● కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న షేక్ ఖాజా మోహిద్దీన్ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సమితి నాయకులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈఎస్ ఖాజా మోహిద్దీన్ ఆదేశాలతోనే పేర్నమిట్ట లిక్కర్ డిపో నుంచి కోటి రుపాయల లిక్కర్‌ను ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ చౌదరి మాయం చేశాడని ఆరోపించారు. ఇటీవల ఎక్సైజ్ శాఖలో జరిగిన బదిలీల్లో పెద్ద స్థాయిలో ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న కొంతమంది కానిస్టేబుళ్లు, రైటర్లను బదిలీ చేయకుండా ముడుపులు తీసుకున్నట్లు విమర్శించారు. శాఖ పరంగా పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, నారాయణ, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

8లోగా అభ్యంతరాలు తెలియజేయాలి

ఒంగోలు సిటీ: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టును సమగ్రశిక్ష కార్యాలయం, డీఈఓ ఆఫీస్ నోటీస్ బోర్డులో ఉంచినట్లు డీఈఓ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై అభ్యంతరాలను ఈ నెల 6 నుంచి 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని కోరారు. సబ్జెక్టు వారీగా 1:10 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించిన అనంతరం ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను prakasam.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



వ్యాసరచన పోటీల్లో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఒంగోలు టౌన్: పోలీసు అమరవీరుల దినోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విజేతలకు మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ బహుమతులు అందజేశారు. పోలీసు సిబ్బందికి ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు, విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది విభాగంలో పి. శ్రీదేవి ప్రథమ బహుమతి, కె.సత్యనారాయణ ద్వితీయ, బి.ఎవాంజలి తృతీయ బహుమతులు సాధించారు. విద్యార్థుల విభాగంలో కేజీబీవీ జూనియర్ కాలేజీకి చెందిన బి. వెంకటమ్మ, నారాయణ జూనియర్ కాలేజీకి చెందిన షేక్ షకీబ్ , భాష్యం హైస్కూల్‌కు చెందిన డి. పావన నందనలు విజేతలుగా నిలిచారు. పోలీసు పిల్లల విభాగంలో జి.సాయి నిహారిక, ఎం ప్రీతి అనన్య, వి. తరుణ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఎస్పీ మాట్లాడుతూ మంచి అలవాట్లతో పాటుగా చదువులో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తెస్తాం

● క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తాం.. అన్ని సీట్లలో గెలుపే లక్ష్యం
● ఇటీవల ఎన్నికల్లో కూటమి ఎలా గెలిచిందో దేశం కోడై కూస్తోంది
● నియోజకవర్గ ఇన్‌చార్జిల సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ 'కారుమూరి'
● కార్యకర్తలకు అండగా ఉంటామని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భరోసా
● కూటమి ప్రభుత్వంలో వేధింపులు ఎక్కువయ్యాయని ఎమ్మెల్యే బూచేపల్లి విమర్శ



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు



నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమావేశమైన కారుమూరి, చెవిరెడ్డి, బూచేపల్లి

ఒంగోలు సిటీ:

'వైఎస్సార్ సీపీ శ్రేణులను ఒకే తాటిపైకి తెచ్చి మళ్లీ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం, జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేస్తామ'ని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో వారు ప్రసంగించారు. రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి మాట్లాడుతూ.. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎలా గెలిచిందో భారతదేశమంతా కోడై కూస్తోందన్నారు. 'మేమంతా ఓట్లేశాం, అవి ఎటుపోయాయ'ని రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు చెబుతున్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. హర్యానాలో ఏమి జరిగిందో కూడా దేశ ప్రజలు గమనించారన్నారు. ఒంగోలు పార్లమెంట్ స్థానంతోపాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీని పటిష్టం చేస్తామన్నారు. తొలిసారిగా ప్రకాశం జిల్లాకు రావడం ఆనందంగా ఉందని కారుమూరి పేర్కొన్నారు.

■ చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. ఒంగోలు అసెంబ్లీలో పార్టీ బలహీన పడలేదని, భవిష్యత్‌లో కూడా పడబోదన్నారు. కార్యకర్తల విలువ తెలిసిన వ్యక్తిగా తాను ఈ మాట చెబుతున్నానన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కూటమి నాయకులు ఇసుక, మద్యం, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇటువంటి ఆరాచకపాలన గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కంటే ఆరాచకాలపైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎద్దేవా చేశారు.

■ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కూటమి ప్రభుత్వంలో దాడులు, అక్రమ కేసులతో వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కార్యకర్తలకు, సోషల్ మీడియాకు అండగా ఉంటామని పేర్కొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కారుమూరి, చెవిరెడ్డి, బూచేపల్లి, మాజీ ఎమ్మెల్యేలు

■ వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, ప్రజా పాలన రావాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నేతలకు ఘన స్వాగతం

జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయానికి తొలిసారి వచ్చిన కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెవిరెడ్డి భాస్కరరెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ విగ్రహానికి కారుమూరి, చెవిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు తదితరులు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం వారిని పార్టీ నేతలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, అన్నా రాంబాబు, అద్దంకి ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, పార్టీ నేతలు మాదాసి వెంకయ్య, పీడీసీసీబీ మాజీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చుండూరి రవిబాబు, బీసీ విభాగం జోన్-5 ఇన్‌చార్జ్ బొట్ల రామారావు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బొట్ల సుబ్బారావు, బీసీ విభాగం కార్యదర్శి మూడమంచు బాలగురవయ్య, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మహిళా నాయకులు సున్నపురెడ్డి రమణమ్మ, బడుగు ఇందిర, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్, స్వర్ణ శ్యాంసాగర్, నాయకులు దామరాజు క్రాంతికుమార్, కఠారి ప్రసాద్, వేమా శ్రీను, ఎంపీపీ వాసా వెంకటరెడ్డి, నాయకులు వై.వెంకటసుబ్బయ్య, మురళీ, వి.రమణారెడ్డి, కె.ప్రసాద్, కె.వి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, మీరావలి, ఫణిదపు సుధాకర్, కుట్టుబోయిన కోటి, పిగిలి శ్రీను, కుట్టుబోయిన సురేష్, మిరియం వెంకటేశ్వర్లు, బుజ్జి, సుంకర సురేష్, కలికవాయి ఉమ తదితరులు పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగం ఆపాలి

● సర్పంచ్‌లు, ఎంపీటీసీల ప్రమేయం లేకుండా పనులు కేటాయించడం, బిల్లులు చేయడం సరికాదు
● జిల్లా కేంద్రం నుంచి వైపాలేనికి బస్సు ఏర్పాటు చేయాలి
● వై పాలెంలో డిగ్రీ కాలేజిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి
● కలెక్టర్‌ను కలిసిన వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వైపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్

ఒంగోలు అర్బన్: యర్రగొండపాలెం నియోజకవర్గంలో అధికార దుర్వినియోగం జరుగుతోందని, దానిని అరికట్టాలని నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్..కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వైపాలెం నియోజకవర్గంలోని సమస్యలపై తాటిపర్తి చర్చించారు. వైఎస్సార్ సీపీకి చెందిన పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీపీల తీర్మానాలు లేకుండా పనులు కేటాయించడం, బిల్లులు చేసుకోవడం, హార్టీకల్చర్, అగ్రికల్చర్ మెటీరియల్ రిలీజ్ చేయడం ఆపాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులకు సంబంధించిన పనుల కేటాయింపులు, బిల్లులు చేయడం సర్పంచ్‌ల ఆధీనంలో జరిగేలా చూడాలన్నారు. గతంలో సర్పంచ్‌లు చేసిన పనుల తాలూకు బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బిల్లులు జమ చేసుకోకుండా అడ్డుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఈఓలపై చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి పాత బకాయిలు చెల్లించకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాత సప్లయిర్స్‌కు అన్యాయం చేస్తూ వారిని యాప్స్ నుంచి తొలగించి అక్రమంగా కొత్తవారిని చేరుస్తున్నారన్నారు. వారితో చేతులు కలిపి నీటి సరఫరా చేయకుండానే యాప్‌లో నీటి సరఫరా జరిగినట్లు నమోదు చేస్తూ స్టోరేజ్ ట్యాంకులు, పైప్‌లైన్‌లని, బోర్‌వెల్స్‌ని పట్టించుకోకుండా తీవ్ర తాగునీటి సమస్యకు కారణమవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో అక్రమంగా జరుగుతున్న మట్టి మైనింగ్‌ను, అక్రమ రేషన్ బియ్యం రవాణాను, మద్య బెల్టు షాపులను వెంటనే నిలువరించాలని కోరారు. జిల్లా కేంద్రం ఒంగోలు నుంచి యర్రగొండపాలేనికి నేరుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా గ్రామసభలు నిర్వహించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు టీడీపీ నేతలకు ఇష్టం వచ్చిన వారికి కేటాయించడం, బిల్లులు చేసుకోవడం నివారించాలన్నారు.

పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి మూడేళ్ల సమయమా..

సోమవారం నిర్వహించిన డీఆర్‌సీ సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రి వెలిగొండ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పడంపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రశ్నించారు. ప్రాజెక్టులో ఏ మిగులు పనులు ఉన్నాయో చెప్పాలని ప్రాజెక్టు ఎస్ఈని ప్రశ్నించారు. టన్నెల్‌లో మట్టి తీసేందుకు, మిగిలిన చిన్న లైనింగ్ పనులు చేసేందుకు మూడేళ్ల సమయం ఏంటని నిలదీశారు. సుంకేసుల, గుండంచర్ల, కలనూతల గ్రామాలకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ఇచ్చి గ్రామాలను ఖాళీ చేయించాలని, అదేవిధంగా మైనర్ పనులను మరో రూ.350 కోట్లు కేటాయిస్తే నెల నుంచి రెండు నెలల్లో ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయవచ్చన్నారు. త్రిపురాంతకం నుంచి వైపాలెం రోడ్డుకు సంబంధించి కాంట్రాక్టర్ కొంత బిల్లులు తీసుకుని కూడా పనులు ప్రారంభించలేదని సమావేశంలో తెలిపారు. పుల్లలచెరువు, వైపాలెం రోడ్డును ప్రాధాన్యత రోడ్లలో ఉంచాలన్నారు. అదేవిధంగా వైపాలెం-దోర్నాల రోడ్డు పూర్తి నాణ్యత లోపం ఉందని తెలపగా ఇన్‌చార్జ్ మంత్రి కూడా ఎస్ఈని మందలించి ఆ రోడ్డుకు సంబంధించి ఏసీబీ, విజిలెన్స్ ద్వారా విచారణ చేయించాలని ఎస్ఈకి సూచించారు. వైపాలెంలోని హాస్పిటల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వైపాలెంలోని డిగ్రీ కాలేజీలో అన్నీ కోర్సులు ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. ప్రైవేటు కాలేజిలను ప్రోత్సహించేలా ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో అన్నీ కోర్సులు లేకుండా అరకొరగా ఉంచి విద్యార్థుల సంఖ్య లేనందున చేయలేదనడం సరికాదన్నారు.

రుణాల మంజూరులో ఉదారత చూపాలి

● సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
● కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్



బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: అల్పాదాయ వర్గాలు, స్వయం సహాయక సంఘాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు ఉదారత చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ప్రకాశం భవనంలో మంగళవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. దీనిలో జిల్లాలోని బ్యాంకులు నిర్దేశించిన రుణాల లక్ష్యాలపై సమీక్షించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాల మేరకు లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.20,591.18 కోట్లుగా నిర్ణయించామన్నారు. 2024 సెప్టెంబర్ 30వ తేదీ నాటికి రూ.13,420.90కోట్లు రుణాలు మంజూరు చేశామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలకు సంబంధించి ఖరీఫ్‌లో రూ.3900.4కోట్లు రుణాలు అందజేశామన్నారు. రబీలో రూ.4737.16 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. సీసీఆర్ కార్డు ఉన్న ప్రతి కౌలు రైతుకు అర్హత మేరకు రుణాలు ఇవ్వాలన్నారు. పశు సంపద వృద్ధి చేసేలా రైతులకు పశు రుణాలను విరివిగా అందచేయాలన్నారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రూ.1671.3 కోట్లు లక్ష్యంగా ఉండగా ఈ ఏడాది సెప్టెంబర్ 30నాటికి రూ.715.43 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. మెప్మా ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ నాటికి రూ.268.77 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల కింద అర్హులందరికీ రుణాలు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, ఫసల్ బీమా యోజన పథకాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ మేరకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బ్యాంకర్లకు అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి మెసేజ్, ఈ మెయిల్స్ ద్వారా వచ్చే బ్లూ కలర్ లింకులను క్లిక్ చేస్తే మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. కస్టమర్ కేర్ పేరుతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో లీడ్ జిల్లా మేనేజర్ రమేష్, డీఆర్‌డీఏ, మెప్మా, పీడీలు వసుంధర, రవికుమార్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ జెడీలు శ్రీనివాసులు, బేబిరాణి, సీపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ రమణ, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, జౌళి శాఖ ఏడీ ఉదయకుమార్, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన చిరుతను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: చత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారుడు మొలకా చిరుత ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ వై.బాలగురవయ్య తెలిపారు. ఈ సందర్భంగా పీడీ బాలగువయ్య మాట్లాడుతూ గత నెలలో తెనాలిలో నిర్వహించిన అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచిందన్నారు. జట్టులో కీలక పాత్ర పోషించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చిరుత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే గత నెలలో వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి డి.ఉమాశంకర్ ఉత్తమ ప్రదర్శనకు అవార్డు అందుకున్నారని అన్నారు. ఎంపికైన క్రీడాకారుడు చిరుతను, కబడ్డీలో అవార్డు పొందిన ఉమాశంకర్‌ను హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా తమ పాఠశాల క్రీడాకారులు విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు వర్షిత



రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో విజయం సాధించిన సంతనూతలపాడు విద్యార్థులు

సంతనూతలపాడు: సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.వర్షిత జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద తెలిపారు. గుంటూరు జిల్లా రేపల్లెలో అక్టోబర్ 26, 27, 28 తేదీల్లో అండర్ 14 స్కూల్ గేమ్స్ హ్యాండ్ బాల్ పోటీల్లో సంతనూతలపాడు హైస్కూల్ కు చెందిన 9, 7వ తరగతి విద్యార్థులు వి. వర్షిత, టీ హేమ పాల్గొన్నారు. వర్షిత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ నెలలో జార్ఖండ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో వర్షిత ఆంధ్రప్రదేశ్ టీమ్ కు ప్రాతినిధ్యం వహించనున్నట్లు హెచ్‌ఎం ప్రమోద పేర్కొన్నారు. అదేవిధంగా వర్షిత సోదరుడు అనిల్ ప్రకాశం జిల్లా అండర్ 17 క్రికెట్ పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. సంతనూతలపాడు హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయా విద్యార్థులు వర్షిత, అనిల్ లను హెచ్‌ఎం. ఎం.ప్రమోద, పీడీ బి.శ్రీనివాస్ రెడ్డి, కే మల్లికా రాణి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

మోతాదుకు మించి మాత్రలు మింగి..

● మతిస్థిమితం లేని యువకుడు మృతి



మృతి చెందిన సుబ్బారావు

కొత్తపట్నం: మతిస్థిమితం లేని ఓ యువకుడు మోతాదుకు మించి మాత్రలు మింగి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు.. నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ఎం.సుబ్బారావు(38), భార్య తిరుపతమ్మతో కలిసి కొత్తపట్నం మండలం మోటుమాలలోని భగవాన్ మహర్షి వృద్ధాశ్రమంలో నాలుగేళ్లుగా పనిచేస్తున్నాడు. సుబ్బారావుకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వైద్యుల సలహా మేరకు మందులు వేసుకుంటున్నాడు. ఈ నెల 4న అధిక మోతాదులో మాత్రలు మింగడంతో స్పృహ తప్పి పడిపోగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సుధాకర్‌బాబు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నమో.. నాగేంద్రాయ



సింగరాయకొండలో పూజలు చేస్తున్న భక్తులు



పామూరులో నాగబంధం చుడుతున్న యువతి



దొనకొండలో నాగేంద్రుడికి భక్తుల పూజలు



నాగుల చవితి పర్వదినాన్ని జిల్లాలో భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే పుట్టలు, శివాలయాలకు చేరుకుని పూజలు చేసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు



ఒంగోలు : పుట్ట వద్ద క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

విద్యుత్ భారాన్ని ప్రభుత్వమే భరించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు కూడా గడవక ముందే రూ.6720 కోట్ల భారాన్ని ప్రజల మీద వేసేందుకు రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్ల భారాన్ని వేయడం చరిత్రలో కనివినీ ఎరగనిదని చెప్పారు. ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచం అని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు ప్రజల పాలిట ఉరితాళ్లు అని ప్రచారం చేసిన టీడీపీ ఇప్పుడు అవి ఉరితాళ్లు కావా అంటూ నిలదీశారు. గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇవ్వాలని కోరారు. నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్ నిర్మించలేకపోతే ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో వేగాన్ని పెంచాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని వదిలేసి నాన్నకు ఇంధనం పథకాన్ని జోరుగా అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక దారి తప్పిందని, అధికార పార్టీ నాయకుల అవినీతికి పరాకాష్టగా ఉచిత ఇసుక మద్యం పాలసీలు నిలిచాయన్నారు. జిల్లాలో ఒక్క మండలం కూడా కరువు జాబితాలో లేకపోవడం దారుణమన్నారు. డీడీఆర్‌సీ సమావేశంలో ఎమ్మెల్యే సమస్యలపై స్పందించకపోవడంపై మండిపడ్డారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకటరావు, అందే నాసరయ్య, ఆర్ రామకృష్ణ, ఎం విజయ, నల్లూరి మురళి, బాలకోటయ్య, కొత్తకోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.